సాక్షి
వికారాబాద్

గురువారం । 28 । డిసెంబర్ । 2023



సమస్యలపై నేతల గరం

అధికారుల తీరుతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానిక నేతలు ఎమ్మెల్యేకి విన్నవించారు. 8లో ▸



ఖర్చులు భరించలేం

ప్రభుత్వ కార్యక్రమాలను తాము నిర్వహించలేమని పలు గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో ▸



ఇవేం బస్సులు మహాప్రభో!

తాండూరు–ధారూరు మీదుగా మెహదీ పట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు అనంతగిరి గుట్ట ఎక్కుతూ ఆగిపోయింది. 9లో ▸

న్యూస్‌రీల్

భక్తిభావం అలవర్చుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న సునీతారెడ్డి

మర్పల్లి: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పట్లూరు తండా సేవాలాల్ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. తండాకు చెందిన గుర్మానాయక్ ప్రజాసేవలో ఉండటం అభినందనీయమన్నారు.

రొట్టెలు చేసిన సునితమ్మ

పాట్లూరి తండా వచ్చిన సునితమ్మ ఓ ఇంటి ముందు మహిళలు జొన్న రొట్టెలు చేయడాన్ని గమనించి అక్కడికి వెళ్లారు. వారితో మాట్లాడి రొట్టెలు చేశారు. జొన్న రొట్టెలు ఆరోగ్యానికి చాలా మంచిదని, రొట్టెలు తినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు స్వప్న, మంజుల, మాజీ సర్పంచ్ సురేష్, నాయకులు నందు, రామేశ్వర్, సురేష్, రతన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

అనంతగిరి: వికారాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్, నిర్మల్ పట్టణాల్లో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని స్రవంతి బాక్సింగ్‌లో రెండో స్థానం, సాఫ్ట్‌బాల్ పోటీల్లో అనూష మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరు వెండి, రజత పతకాలు సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

రిసార్ట్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాలి

ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్



ఎస్పీ కోటిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న రిసార్ట్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కోటిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈవెంట్లు, డీజే సౌండ్, లైటింగ్ వల్ల వన్య ప్రాణులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. అదే విధంగా చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నట్లు చెప్పారు. ఆధునిక కల్చర్ పేరుతో రిసార్ట్స్ నడుపుతున్నారని అన్నారు. డిసెంబర్ 31న డీజేలకు అనుమతులు ఇవ్వరాదని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు నర్సింలు, ప్రకాష్, సుభాష్, అంజి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ఐటీఐ కళాశాల కొనసాగేలా కృషి చేస్తా

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కళాశాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి తాండూరు పరిధిలో ఐటీఐ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగేలా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామానుజం ఎమ్మెల్యేను కలిసి కళాశాల వివరాలను తెలియజేశారు. తాండూరు మండలం జినుగుర్తి పరిధిలోని ఓ ప్రభుత్వ భవనాన్ని ఐటీఐ కళాశాల కోసం కేటాయించారు. అయితే కళాశాలకు కావాల్సిన పరికరాలను అందకపోవడంతో అడ్మిషన్లు జరగలేదు. ఈ విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు ప్రాంత విద్యార్థులకు ఐటీఐ కళాశాల ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కళాశాలకు కావాల్సిన ఫర్నీచర్, పరికరాలను తెప్పించి, రాబోయే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

'గ్యారంటీ'లు పక్కా

ఎంత కష్టమైనా ఆరు పథకాలను అమలు చేస్తాం

- పార్టీలకతీతంగా సంక్షేమం
- మన ప్రాంతానికి ఏది అవసరం ఉన్నా తీసుకొస్తా
- అమలు చేసే బాధ్యత అధికారులదే
- అలసత్వం వహిస్తే సహించేది లేదు
- అధికారుల సమీక్షలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ఎన్నికలు ముగిశాయి.. ఇక పార్టీలు, రాజకీయాలు పక్కన పెట్టి అందరం కలిసి ప్రజల కోసం పని చేద్దామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరు గ్యారంటీల అమలు కోసం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ఎంత కష్టమైనా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌గా నేను ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నందున అభివృద్ధి ఆగే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. మన ప్రాంతానికి ఏది అవసరం ఉన్నా సీఎంతో మాట్లాడి తీసుకొస్తానని.. అమలు చేసే బాధ్యత అధికారులదేనని అన్నారు. అధికారులు బాగా పని చేసి అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని సూచించారు. గతంలో ఏం జరిగిందో మాకు అనవసరం.. ఇక నుంచి అధికారులు చిత్తశుద్ధి, సమన్వయంతో పని చేయాలి. అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాల సంప్రదాయాలను పక్కన పెట్టండి.. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆరు గ్యారంటీ కోసమే కాకుండా ఇతర అవసరాల కోసం అర్జీలు ఇస్తే స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అప్లికేషన్లను ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. దరఖాస్తులు నింపడం రాని వారికి అధికారులు సాయం చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. వారం రోజుల్లో సీఎం ప్రకటన చేసే అవకాశం ఉందని చెప్పారు. ధరణి స్థానంలో త్వరలో కొత్త చట్టం వస్తుందని వివరించారు. అంతవరకు వేచి చూడకుండా అధికారుల వద్దకు వచ్చే భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమం ప్రతి నాలుగు నెలలకు ఒక్కసారి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అధికారుల సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. అనంతరం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ఒకే దరఖాస్తులో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలు ఉంటాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి దరఖాస్తు ఫారం అందేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆర్డీఓ విజయకుమారి, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఏడాది గడుస్తున్నా..

- కొలిక్కి రాని మైసమ్మ తల్లి విగ్రహం చోరీ కేసు
- అధికారులే తొలగించారని తాడిపర్తి వాసుల ఆరోపణ
- అనుమతి ఇస్తే మరో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని వెల్లడి

యాచారం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరొందిన తాడిపర్తి తాటికుంట మైసమ్మ తల్లి విగ్రహం చోరీకి గురై ఏడాది గడుస్తోంది. యాచారం–కడ్తాల్, కందుకూరు మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఈ అమ్మవారి ఆలయం ఉంది. ఈ అమ్మవారిని నమ్ముకున్న యువతకు ఉద్యోగాలు, పెళ్లిలు, సంతానం కలగడం, రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులుగా గెలుపొందారని ప్రసిద్ధి. అమ్మవారి దర్శనానికి జిల్లా వాసులతో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి నిత్యం వేలాదిగా తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకుని పండుగలు చేసుకునే వారు. ఇంతటి మహిమ ఉన్న అమ్మవారి విగ్రహం చోరీకి గురి కావడంతో భక్తులకు తీవ్ర ఆందోళన, ఆగ్రహాన్ని కలిగించింది.

నేటికీ లభించని ఆధారాలు

ఇంతటి ప్రాశస్త్యాన్ని కలిగిన అమ్మవారి విగ్రహం చోరీకి గురై ఏడాది గడిచింది. ఇందుకు సంబంధించి నేటికీ చిన్న ఆధారం లభించలేదు. అమ్మవారి విగ్రహాన్ని అటవీ శాఖ అధికారులే తస్కరించారని అప్పట్లోనే గ్రామస్తులు పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు, రెవెన్యూ అధికారులకు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. గత ప్రభుత్వం తాడిపర్తి గ్రామాన్ని ఫార్మాసిటీ కింద ఎంపిక చేయడం, అటవీ ప్రాంతంలో ఉన్న మైసమ్మ తల్లిని దర్శనం చేసుకోవడం కోసం నిత్యం భక్తుల రద్దీ పెరగడం, భవిష్యత్‌లో భక్తుల తాకిడి పెరిగితే ఇబ్బంది కలుగుతుందనే భావనతోనే అటవీ శాఖ, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులే అమ్మవారి విగ్రహాన్ని తీసేశారనే భక్తుల ఆరోపణ.



అమ్మవారి విగ్రహం(ఫైల్)

ప్రతిష్ఠాపనకు అమ్మవారికి విగ్రహం

అటవీ ప్రాంతంలో కొలువైన అమ్మవారి ఆలయానికి నిత్యం వందలాది మంది, గురు, ఆదివారాల్లో వేలాది మంది భక్తులు తరలివచ్చేవారు. ఆలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో ఉండడంతో ఆలయ నిర్వహణ నుంచి గ్రామ పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం సమాకూరుతుండేది. భక్తుల బోనాలు, జంతు బలులతో పండుగలు చేసుకోవడంతో అటవీ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడేది. అమ్మవారి విగ్రహం చోరీ కేసు ఛేదించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గ్రామస్తులు 2022 డిసెంబర్‌లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దుర్గి నుంచి అమ్మవారి విగ్రహానికి తీసుకువచ్చి ప్రతిష్ఠాపనకు సంకల్పించారు. కానీ భక్తులను అటవీ ప్రాంతంలోకి అనుమంతించకుండా ఆయా శాఖల అధికారులు కట్టుదిట్టం చేశారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేసి భయాందోళనలు కలిగించడంతో ప్రజలు ప్రతిష్ఠాపనకు వెనుకడుగేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఫార్మాసిటీ రద్దు చేయడంతో భక్తుల్లో మళ్లీ తాటికుంట మైసమ్మ తల్లి దీవెనల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు.



భారీ వర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి పంట (ఫైల్)

ఒడిదుడుకుల సేద్యం

- వానాకాలం సీజన్ నుంచి వెంటాడిన అతివృష్టి
- యాసంగిలో వరికి కష్టాలు
- అధిక వర్షాలతో తీవ్ర నష్టం
- పరిహారం ఇవ్వకుండా చేతులెత్తేసిన గత ప్రభుత్వం
- గణనీయంగా తగ్గిన పత్తి, కంది దిగుబడులు
- కూరగాయల సాగులోనూ నష్టాలే

2023 రివైండ్

వికారాబాద్: జిల్లాలో ఈ ఏడు (2023) వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. నాలుగేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతన్న నష్టాలను చవిచూశాడు. ఈసారైనా కలిసి వస్తుందనుకున్న కాలం మరోసారి కన్నీటి పాలుజేసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలు పడటంతో పంటలకు నష్టం జరిగింది. ఈ సంవత్సరం కూడా రైతుకు కన్నీరే మిగిల్చినట్టయ్యింది. మర్పల్లి, మోమిన్‌పేట తదితర మండలాల్లో వడగండ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రధాన పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది ఖరీఫ్ ఆరంభంలో అతివృష్టి నష్టం చేకూర్చింది. దీంతో పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఇలా ఈ ఏడాదంతా రైతు ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. గత యాసంగి సీజన్‌లో కొనుగోళ్లలో తలెత్తిన ఇబ్బందులు రైతును మరింత కుదేలయ్యేలా చేసింది. పదే పదే తుపాన్ల కారణంగా వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా ప్రభుత్వం కనీసం పంట నష్టం అంచనాలు కూడా సిద్ధం చేయలేదు.

తగ్గిన మక్క, పత్తి దిగుబడి

ఈ సంవత్సరం విత్తనాలు వేసింది మొదలు మొక్కజొన్న రైతుకు కష్టకాలం ఎదురైంది. విత్తనాలు వేసే సమయంలో వర్షాలు కాస్త ఆలస్యంగా కురవడంతో సగం మాత్రమే మొలకెత్తాయి. చాలా చోట్ల రెండోసారి విత్తు వేసుకోవాల్సి వచ్చింది. అనంతరం జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన అధిక వర్షాలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేలా చేసింది. అధిక వర్షపాతం పంటలను కుంగదీసింది. మొక్కజొన్న పంటతో పాటే పత్తి రైతుకు కూడా నష్టాలను చవిచూశాడు. దిగుబడిపై కూడా తీవ్ర ప్రభావం పడింది. జిల్లాలోని 20 మండలాల్లో 1.40 లక్షల మంది రైతులు 2.40లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. సగటున ఎకరానికి 10 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా అతివృష్టి కారణంగా ఎకరానికి కేవలం నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 46వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా దిగుబడి గణనీయంగా తగ్గింది. పంట చేతికి వచ్చాక మొక్కజొన్నలు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం చేతులెత్తేయటంతో దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ గాడి తప్పటం కూడా రైతులను నష్టాల పాలు చేసింది.

కూరగాయ పంటలకూ..

ఈ ఏడు వానాకాలం సీజన్‌లో జిల్లాలో 25వేల ఎకరాల్లో కూరగాయ పంటలను సాగు చేశారు. క్యారెట్, బీట్రూట్, టమాటా, చిక్కుడు, బెండ, బీరీన్స్, క్యాబేజీ వంట పంటల తోపాటు ఆకుకూరలు సాగు చేశారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో కురిసిన అధిక వర్షాలకు కాపుకొచ్చిన టమాటా, క్యారెట్, బీట్రూట్ దెబ్బ తిన్నాయి. దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వడంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.

అందరి గురి చేవెళ్లపైనే!

- ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్
- సిట్టింగ్ అభ్యర్థికే అవకాశం
- కాంగ్రెస్ నుంచి ఆశావహుల మధ్య పోటా పోటీ
- బీజేపీ నుంచి కొండాను బరిలో దింపే చాన్స్..?

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పార్లమెంట్ ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజ కవర్గంలో మాత్రం ఎన్నికల వేడి రాజుకుంది. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికే మళ్లీ ఛాన్స్ ఇస్తూ బీఆర్‌ఎస్ అధిష్టానం ఊహాగానాలకు చెక్‌పెట్టగా, ఎలాగైనా ఈ స్థానాన్ని చేజిక్కించుకోవాలని ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ ఆశావహులు పోటీపడుతున్నారు. చేవెళ్ల కేంద్రంగా రాజకీయ వ్యూహాలు రచిస్తున్నా యి. ఇటీవల మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహా ఈ అసెంబ్లీ టికెట్ ఆశించి, చివరి నిమిషంలో భంగపడిన పారిజాత నర్సింహారెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి అతి సన్నిహితుడైన ఎలుగింటి మధుసూదన్‌రెడ్డి సహా మరికొంత మంది నేతలు పోటీ పడుతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీకి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఆయన ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పట్టు సాధించేందుకు యత్నిస్తున్నారు. తనకంటూ ఓ ప్రత్యేక కేడర్‌ను తయారు చేసుకుని ముందుకెళ్తున్నారు.

ఆ ఆంతర్యం ఏమిటో?

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఈ పార్లమెంట్ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. తొలి ఎన్నికల్లో దివంగత సూదిని జైపాల్‌రెడ్డి ఇక్కడి నుంచి విజయం సాధించారు. రెండోసారి పోటీకి ఆ యన ఆసక్తి చూపలేదు. 2014లో ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి కారుగుర్తుపై పోటీ చేసిన రంజిత్ రెడ్డి విజయం సాధించారు. ఇక్కడి నుంచి ఒకసారి విజయం సాధించిన వారు.. రెండోసారి పోటీకి పెద్దగా ఆసక్తి చూపిన దాఖలాలు లేవు. పోటీ చేసిన వారు ఓటమి పాలయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలుండగా, ఆ పార్టీ అధిష్టానం కేవలం చేవెళ్ల లోక్‌సభ స్థానానికే అభ్యర్థిని ప్రకటించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనేది అంతు చిక్కడం లేదు.

అనేక సవాళ్లు

అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అక్కడ బీఆర్‌ఎస్ ఓటమి పాలైంది. చేవెళ్ల అభ్యర్థికి అండదండగా నిలిచినప్పటికీ.. కేవలం 268 ఓట్లతోనే బీఆర్‌ఎస్ గట్టెక్కింది. రాజేంద్రనగర్ నుంచి ఆయన ఎమ్మెల్యే టికెట్ ఆశించినట్లు అప్పట్లోనే పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను పక్కన పెట్టి.. ఆయన సొంతంగా పలు కార్యక్రమాలు చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తన తనయుడికి చేవెళ్ల నుంచి ఎంపీ టికెట్ ఆశించి భంగపడింది. ప్రస్తుత పరిస్థితుల్లో వారిద్దరూ ఆయన గెలుపునకు కృషి చేస్తారా? అంటే అనుమానమే. దీనికి తోడు శేరిలింగంపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్‌లో బీజేపీ బలంగా ఉంది. వికారాబాద్, పరిగి, తాండూరులో కాంగ్రెస్ హవా కొనసాగుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. గత ప్రభుత్వం జీఓ నంబర్ 111 ఎత్తి వేసినట్లు చెపుతున్నా.. సాంకేతికంగా ఇప్పటికీ జీఓ అమల్లోనే ఉంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆయన మళ్లీ నెగ్గుకొస్తారా? అంటే వేచి చూడాల్సిందే.

అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ
శేరిలింగంపల్లి	1,57,557	1,10,934	80,293
రాజేంద్రనగర్	1,21,734	62,057	59636
మహేశ్వరం	1,25,578	70,657	99,391
చేవెళ్ల	75,843	74,981	37,886
పరిగి	74,523	98,536	16,653
వికారాబాద్	73,992	86,885	7,132
తాండూరు	78,079	84,662	4,087

ధ్యానంతోనే జ్ఞానం, ఆనందం

2024లో వైభవంగా నిర్వహిస్తాం

- పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- జీవకోటి స్వేచ్ఛకు పాటుపడాలి
- హిందూ ధర్మ ప్రచారకుడు రాధామనోహర్
- 7వ రోజుకు చేరిన ధ్యాన మహాయాగం



మాట్లాడుతున్న పరిమళపత్రి

కడ్తాల్: వచ్చే ఏడాది పత్రీజీ మహిళా ధ్యాన మహాయాగం వైభవంగా నిర్వహిస్తామని పీఎస్‌ఎస్‌ఎం(పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ మూవ్‌మెంట్) గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు ధ్యాన జనుల సందడితో కొనసాగుతున్నాయి. ఈ ధ్యాన మహాయాగాలు బుధవారంతో ఏడవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పత్రీజీ కూతురు పరిమళ పత్రి మాట్లాడుతూ.. సత్యం తెలుసుకోవాలనే కోరిక ఉన్నవారే పీఎస్‌ఎస్‌ఎంలోకి వస్తారన్నారు. ప్రతీ మనిషి భయం లేకుండా జీవించడమే పత్రీజీ కోరుకునే వారని గుర్తు చేశారు. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానం దైనందిన జీవితంలో తప్పక ఆచరించాలని సూచించారు. ధ్యానంతోనే ప్రజలు ఆనందంగా ఉంటారన్నారు. ప్రతీ ఒక్కరు ధ్యాన ప్రచారం చేయాలని కోరారు.

శ్వాసపై ధ్యాస అవసరం

హిందూ ధర్మ ప్రచారకుడు రాధామనోహర్ ప్రసంగిస్తూ.. ప్రతీ మనిషి సరల జీవకోటి స్వేచ్ఛ కోసం పాటుపడాలని సూచించారు. శ్వాసపై ధ్యాస ఉంటేనే సంపూర్ణ శక్తి లభిస్తుందన్నారు. తనను తాను తెలుసుకోవాలని పత్రీజీ చెప్పిన సూత్రం ఎంతో గొప్పదన్నారు. అనంతరం ధ్యాన జగత్ మాస పత్రిక–2024తోపాటు, ఓట్ ఫర్ వెజ్ వెబ్‌సైట్‌ను పరిమళ పత్రి, పరిణిత పత్రి ఆవిష్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ధ్యానుల, పిరమిడ్ మాస్టర్‌ల అనుభవాలు ఆకట్టుకున్నాయి. ధ్యాన కేంద్రానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ధ్యానులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పెద్ద ఎత్తున్న ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు హనుమంతరాజు, బాలకృష్ణ, నవకాంత్, ఆనంద్, రాయజగపతిరాజు, వాణి, మాధవి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కేంద్ర హోం మంత్రి పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికలపై కమలదళానికి దిశా నిర్దేశం చేసేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురువారం కొంగరకలాన్‌కు రానున్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగర్‌కలాన్‌లో ఉన్న శ్లోక కన్వెన్షన్ హాల్ బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశాలకు వేదికైంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో 2023 శాసనసభ ఎన్నికల ఫలితాల విశ్లేషణతో పాటు 2024 లోక్ సభ ఎన్నికలకు ఎలా సిద్ధమవ్వాలి? వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, సంస్థాగత విషయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర పదాధికారులు, అధికార ప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జాతీయ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లు, పార్లమెంట్ ప్రభారీలు హాజరవుతారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పూడూరు: చికిత్స పొందుతూ ఓ వివాహిత మృతి చెందిన సంఘటన బుధవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలంలోని మన్నేగూడకు చెందిన హేమలత(32)ను చీలాపూర్ గ్రామానికి చెందిన భీమయ్యకు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఈ నెల 14న హేమలత వంట చేస్తుండగా ఆమె భర్త గొడవపడి కొరకాసుతో నిప్పంటించడంతో చీరతో పాటు శరీర భాగాలు కాలాయి. ఆమెను ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. మృతురాలి తల్లి చించెట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటార్ వైండింగ్ దుకాణంలో చోరీ

రూ.6 లక్షల సామగ్రి అపహరణ



దుండగులు కత్తిరించిన రేకు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపురం గ్రామ శివారులో మోటార్ వైండింగ్ దుకాణంలో దుండగులు రూ.6 లక్షలకు పైగా సామగ్రిని అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొహమ్మద్ మహబూబ్ శివారులో మోటార్ వైండింగ్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిగానే మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. బుధవారం షాపు తెరిచి చూడగా రివైండింగ్ మోటార్‌లు అన్ని చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దుకాణం వెనుక భాగంలో రేకును కత్తిరించి, రూ.6 లక్షల విలువ గల మోటార్ సామగ్రి, వైర్లను దొంగలించారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలతో పాటు హార్డ్ డెస్క్‌ను సైతం అపహరించారని ఆయన తెలిపారు. బాధితుడు మహబూబ్ శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



మురళిమోహన్‌గౌడ్(ఫైల్)

మొయినాబాద్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన చేగూరి శ్రీశైలంగౌడ్ కుమారుడు మురళిమోహన్‌గౌడ్(22) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కొంత కాలం క్రితం సొంత భూమి విక్రయించి వచ్చిన డబ్బులతో ఇతర చోట్ల అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు సమయం దగ్గర పడటంతో సరిపడా డబ్బులు లేక ఇబ్బందులు పడ్డారు. డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని మనస్తాపం చెంది అప్పారెడ్డిగూడ సమీపంలోని జామతోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తోటలో పనిచేసే వ్యక్తి గమనించి స్థానికులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సమస్యలపై నేతల గరం

- అధికారులు మాత్రం మారుతున్నారు
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల మొర
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి అభ్యర్థనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ప్రతి సర్వసభ్య సమావేశానికి కొత్త అధికారులు వస్తున్నారే తప్ప, సమస్యలు పరిష్కారం కావడం లేదని మండల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎదుట విన్నవించారు. బుధవారం ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ అధికారి యాదగిరి వివరాలు వెల్లడించారు. రైతు బీమా పథకంలో 90 శాతం సకాలంలో బాధిత కుటుంబాలకు పాలసీ డబ్బులు అందాయన్నారు. అనంతరం పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతుండగా.. రెండో విడత గొర్రెల పంపిణీ నేటికీ జరగలేదని, డీడీలు కట్టిన రైతులకు డబ్బులైన తిరిగి చెల్లించాలని లేవనెత్తారు. 542 మంది డీడీలు కట్టగా, 42 మందికి మాత్రమే గొర్రెల యూనిట్ మంజూరైందని అధికారి వెల్లడించారు. బడ్జెట్ లేని కారణంగా మిగతా వారికి మంజూరు కాలేదని, త్వరలో పంపిణీ జరిగే అవకాశం ఉందని వివరించారు. ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌కృష్ణారెడ్డి వివరాలు వెల్లడిస్తుండగా వివిధ గ్రామల సర్పంచ్‌లు కరెంటు సమస్యలపై ప్రశ్నించారు. గత సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో ఇనుప స్తంభాలు మార్చాలని, వేలాడుతున్న తీగలను సరిచేయాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలో కొత్త అధికారి వస్తున్నారే తప్ప, కరెంటు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దాయిపేటలో మూడు రోజుల పాటు ఎల్లమ్మ జాతర ఉన్నదని, కరెంటు సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీలు క్రిష్ణయ్యగౌడ్, రాములు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ శాఖపై డీటీ లక్ష్మణ్ వివరాలు వెల్లడిస్తుండగా, ఎంపీటీసీ లక్ష్మప్ప కల్పించుకొని అభివృద్ధి పనుల కోసం ఇసుక అవసరమై డీడీలు కట్టినప్పటికీ అనుమతి మాత్రం ఇవ్వడం లేదని మండిపడ్డారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఉపాధి హామీ ఎఫ్ఏలకు జీతాలు, బిల్లులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.

పదేళ్లుగా బడ్జెట్ లేక ఇబ్బందులు

మొదటిసారిగా యాలాల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా విన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లుగా పేపర్లపైనే అభివృద్ధి చూపించారన్నారు. ప్రతి శాఖకు చెందిన నిధులను మళ్లించారని, తద్వారా రూ.1.5 కోట్ల అడ్వాన్స్ అగ్రిమెంట్‌లు చేశారని గుర్తు చేశారు. దీంతో ఆయా శాఖల్లో చేసిన పనులకు సైతం డబ్బులు చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. యాలాల మండలంలోని జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ రమేష్, మండల ప్రత్యేకాధికారి శంకర్‌నాయక్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య పాల్గొన్నారు.

ఐదు నెలలుగా జీతాలు లేవు

భారంగా కుటుంబ పోషణ

- పూర్వ వీఆర్ఏల ఆందోళన



తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

మోమిన్‌పేట: ప్రమోషన్‌లు ఇచ్చినా.. ఐదు నెలలుగా జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నామని పూర్వ వీఆర్ఏలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండల తహసీల్దార్ మనోహర చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్ఏలకు ప్రమోషన్‌లు ఇచ్చి జూనియర్ రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటరులుగా నియమించి ఐదు నెలలు కావస్తున్న ఉద్యోగ ఐడీ, జీతాలు ఇవ్వడం లేదన్నారు. కుటుంబ పోషణ భారమైనా ఇన్ని రోజులు విధులు నిర్వహించామని ఇక మీదట విధులు నిర్వహించబోమని వారు పేర్కొన్నారు. ఉద్యోగ గుర్తింపు కార్డులు, జీతాలు ఇచ్చేంత వరకు విధుల్లో చేరబోమని తెలిపారు. కార్యక్రమంలో మహేష్, అలివేల, మోహిన్, శేఖర్, రఘు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ఖాళీ సిలిండర్ లారీలో మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అనంతగిరి: గ్యాస్ సిలిండర్ల లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన బుధవారం వికారాబాద్ పట్టణ ప్రధాన రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఖాళీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీలో బీజేఆర్ చౌరస్తా సమీపానికి రాగానే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. విషయాన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. అటుగా వస్తున్న వాహనాలకు ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది సైతం సకాలంలో వచ్చి మంటలను అదుపుచేశారు. పెద్ద ప్రమాదాన్ని తప్పించిన ట్రాఫిక్ పోలీసులను పట్టణవాసులు అభినందించారు.

ఇవేం బస్సులు మహాప్రభో!



అనంతగిరిగుట్టలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



కాలినడకన గుట్ట ఎక్కుతున్న ప్రయాణికులు

- అనంతగిరిగుట్ట ఎక్కలేక మధ్యలో ఆగిన ఆర్టీసీ బస్సు
- తీవ్ర అవస్థలు పడ్డ ప్రయాణికులు

ధారూరు: తాండూరు నుంచి ధారూరు మీదుగా మెహదీపట్నం వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అనంతగిరిగుట్ట ఎక్కుతూ మధ్యలో ఆగిపోయింది. కాలం తీరిన బస్సుతో చేసేది లేక డ్రైవర్ ప్రయాణికులను దింపేసి ఖాళీగా గుట్ట ఎక్కించారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు తాండూరు నుంచి బయలుదేరి అనంతగిరిగుట్ట ఎక్కుతూ ఆగిపోయింది. ప్రయాణికులు సీట్ల కెపాసిటీ కన్నా ఎక్కువగా ఉండటం, కాలం తీరిన బస్సు కావడం కావడంతో గుట్ట ఎక్కలేక మొరాయించింది. డ్రైవర్ విజ్ఞప్తి మేరకు ప్రయాణికులు కాలినడకన గుట్ట ఎక్కారు. డొక్కు బస్సులను ఆర్టీసీ నడుపుతుందని, అవి ఎప్పుడు, ఎక్కడ ఠక్కున ఆగిపోతాయో ఎవరికీ తెలియదని ప్రయాణికులు వాపోయారు. ముఖ్యంగా తాండూరు నుంచి బస్సులు ఎక్కువగా ట్రబుల్ ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఉదయం వేళల్లో ఆర్డినరీ బస్సులుగా లోకల్ ట్రిప్పులకు పంపించిన తర్వాత వాటినే తిరిగి ఎక్స్‌ప్రెస్ బస్సులుగా మార్చి తాండూరు నుంచి హైదరాబాద్‌కు పంపిస్తున్నారని వారు ఆరోపించారు. ఇకనైన ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త వాటిని నడపాలని కోరుతున్నారు.

ఖర్చులు భరించలేం



ప్రజాపాలన విధానాలను తెలుపుతున్న ప్రత్యేకాధికారి సరళాదేవి

- గతంలో నిర్వహించిన వాటికే నిధులు రాలేదు
- ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై సర్పంచుల ఆవేదన
- 'ప్రజాపాలన' సమీక్షలో అధికారుల దృష్టికి నేతలు

కుల్కచర్ల: ప్రభుత్వ కార్యక్రమాలను తాము నిర్వహించలేమని, ఇంతకు ముందు చేసిన వాటికే ఇప్పటికీ బిల్లులు అందని పరిస్థితి ఉందని కుల్కచర్ల మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ, రెవెన్యూ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్వీడు గ్రామ సర్పంచ్ బాలయ్య మాట్లాడుతూ.. ట్రైనీ కలెక్టర్ల శిక్షణ కార్యక్రమానికి తాము ఖర్చు చేసిన డబ్బులు ఇప్పటివరకు అందలేదన్నారు. పదవీ సమయం పూర్తి కావస్తున్న దశలో సైతం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమాలు నిర్వహించినా ఎటువంటి నిధులు అందలేదని, ఇకపై తాము భరించలేమన్నారు. వీరాపూర్ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమకు ఇదివరకు బిల్లులను పూర్తిస్థాయిలో చెల్లిస్తేనే ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ముందస్తుగా నిధులను అందిస్తేనే నిర్వహిస్తామని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ సత్యహరిశ్చంద్ర మాట్లాడుతూ.. గతంలో నిధుల విడుదలలో జాప్యం జరగడం వల్ల ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురైన మాట వాస్తవమేనని, ఈ అంశాన్ని అధికారులకు తెలియజేశామన్నారు. ప్రస్తుతం ముందస్తుగా రూ.5 వేలు ఇవ్వడం జరుగుతుందని కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మిగతా డబ్బులు ఇస్తారని ఆమె తెలిపారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఉపేందర్, కుల్కచర్ల మండల ప్రత్యేకాధికారి సరళాదేవిలు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల సహకారంతో వారి సూచనల ప్రకారం పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతగా భావించి ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై అక్కడ ఏర్పాటు చేయబడిన వివిధ సెక్షన్లలో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, కులకచర్ల, చౌడాపూర్ తహసీల్దారులు మురళీధర్, ప్రభులు ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, వ్యవసాయాధికారి వీరస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, ఏపీఎం శోభ, ఏపీఓ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మోత్కుపల్లి బలభీమసేన స్వామి జాతర



జాతరలో కొలువుదీరిన రంగులరాట్నం

కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రాంతానికి అతి సమీపంలోని కర్ణాటకలోని మోత్కుపల్లి శ్రీబలభీమసేన స్వామి వారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రథోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్యలో నిర్వహించారు. పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు వేలాదిగా తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి మంగళ హారతులు అందిస్తూ దర్శించుకున్నారు. బుధవారం స్వామివారికి గజోత్సవం, పుష్కరిణీలో అభిషేకాలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ప్రతిష్టాత్మకంగా 'ప్రజాపాలన'

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో తప్పకుండా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు తప్పకుండా ఆయా గ్రామా ల్లో, వార్డుల్లో పాల్గొనాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వాటికి అధికారులు వెంటనే రసీదు పత్రం ఇవ్వాలన్నారు.

బీడీలకు వెళ్లి.. అనంత లోకాలకు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు: ఆర్టీసీ బస్సును ఢీకొని రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ జాతీయ రహదారిపై చేగూరు కూడలి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్(28) కొన్ని నెలలుగా స్థానికంగా ఉన్న ఓ ప్రీకాస్ట్ వాల్ తయారీ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాత్రి వేళ బీడీలు తెచ్చుకునేందుకు బయటకు వెళ్లి చేగూరు కూడలి వద్ద రోడ్డు దాటి వస్తుండగా ఆర్టీసీ గరుడ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి స్నేహితుడు ముజామిల్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గేట్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ శివప్రసాద్, స్థానికులు వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం వెల్‌జాల్ గ్రామానికి చెందిన పులిజాల వెంకటేశ్(31) వ్యక్తిగత పనుల మీద ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మక్తమాధారం గేట్ సమీపంలోని మూల మలుపు వద్ద ఎదురుగా గడ్డిలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వెన్నెల బల్బు!



బొంరాస్‌పేట: సాధారణంగా వెలుగుతున్న విద్యుత్ బల్బులు చంద్రబింబం వలె ధగధగ మెరిసిపోతుంటాయి. కానీ, వెలగని వీధి దీపాన్ని చందమామ వెలిగిస్తే చూడటానికి రెండు కళ్లు చాలవు. సరిగ్గా అలాంటి దృశ్యమే బొంరాస్‌పేట మండల పరిధిలోని రేగడిమైలారంలో జాతీయ రహదారిపై సాక్షాత్కారమైంది. బుధవారం సాయంత్రం వేళ గ్రామంలో రహదారి పొడుగున ఉన్న లైట్లు వెలిగించగా.. అప్పుడే వెలుగులు నింపుతున్న వెన్నెల ఇలా లైటు వెలగని వైపునకు వచ్చి జాబిల్లి బల్బుగా మారి వావ్ అనిపించింది. దీన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- 'ప్రజాపాలన'పై అవగాహన సదస్సు

మొయినాబాద్‌రూరల్: నేటి నుంచి గ్రామాలలో నిర్వహించే ప్రజాపాలన దరఖాస్తు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కొనసాగించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే యాదయ్య, నియోజకవర్గం ప్రజాపాలన ఇన్‌చార్జి, డీఆర్‌డీఏ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో అందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజాపాలన ఇన్‌చార్జి ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రజాప్రతినిధులు సహకరించి దరఖాస్తుల స్వీకరణ విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంటికో దరఖాస్తు ఉంటుందని ఇంకా వేరే విషయాలు ఉంటే తెల్ల పేపర్‌పై రాసి అభ్యర్థిస్తే, వారికి సైతం రసీదు ఇస్తామన్నారు. ముఖ్యంగా సర్పంచ్‌లు సహకరించి 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు స్వీకరిస్తున్న దరఖాస్తుల పర్వాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభావెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, ఎంపీపీ నక్షత్రంజీవంతు, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, సర్పంచ్‌లు మనోజ్‌కుమార్, చందనచంద్రయ్య, అంబాజీరావు, ఎంపీటీసీ శ్రీనివాస్, అధికారులు వెంకటయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ట్రాక్టర్ చోరీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్, ట్రాలీని దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సి పాలిటీలోని చెత్తను మంగళవారం ట్రాక్టర్‌లో నింపి డంపింగ్ యార్డులో వేసిన అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద నిలిపి వేశారు. బుధవారం ట్రాక్టర్ కోసం మున్సిపల్ సిబ్బంది రాగా ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ సైతం కనిపించలేదు. మున్సిపల్ సూపర్‌వైజర్ శాంతికుమార్ వెంటనే కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు సమాచారం అందించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

'ప్రజాపాలన'తో పేదలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన'కు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహిస్తుందన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వమే ప్రతి ఇంటికి ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు ఫారాలను అందజేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా, నిర్భయంగా అందించబోతుందన్నారు. పేదలకు ప్రభుత్వ లబ్ధి చేకూరే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధర్థ, బస్వం, మురళీమోహన్, జగదీశ్వరప్ప, మోహన్, మధు, ఖదీర్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.